క్లుప్తంగా

ఘనంగా పచ్చాలమ్మ తల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో పచ్చాలమ్మ తల్లి

పెద్దాపురం: మండలంలోని గుడివాడ గ్రామ దేవత పచ్చాలమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కనపర్తి సత్యానందం ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ కనపర్తి నూకరాజు (చీమదొర) దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి కోలాటం, మ్యూజికల్ నైట్, గరగల నత్యం, డప్పు వాయిద్యాలు, పులి ఆట, పలు వేషాధారణలో జాగరణోత్సవం నిర్వహించారు. కళ్ల మిరుమిట్లు గొలిపేలా భారీ బాణసంచా కాల్చారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివిలి జట్లమ్మ జాతర

స్థానిక పిఠాపురం రోడ్డులోని దివిలి జట్లమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నరాలశెట్టి బాబ్జీ రావు ఆధ్వర్యంలో వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్న సంతర్పణను డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు.

మదుగులమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మదుగులమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో కొలువైన మదుగులమ్మ జాతరలో భాగంగా మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం జాతర ఉత్సవాలు ప్రారంభం కాగా, ఆలయ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి కుటుంబంలోను నైవేద్యాలు పెట్టుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య అమ్మవారి జాతర నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్య లో అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, గిరి, యవర్ణ అబ్బాయి, సత్తిబాబు, మార్ని హరి, మార్ని సురేంద్ర, టి.వెంకటేశ్వర రావు భక్తులకు సేవలందించారు. జాతరను పురస్కరించు కొని గ్రామంలో ఎటువంటి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా సీఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సాహంగా నీలమ్మ జాతర

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద కొలువైన నీలమ్మ తల్లి జాతర మంగళవారం ప్రారంభమైంది. అమ్మవారి సిరి బొమ్మను ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. ఆలయ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు, గరగల నృత్యాలు, డప్పులు, డాన్సులతో జాతర నీలమ్మ చెరువు, గొల్లగూడెం, పిఠాపురం రోడ్డు, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్ మీదుగా ఆలయానికి చేరింది. వైశాఖ అమావాస్యను పురస్కరించుకొని జాతర నిర్వహించారు. జాతరలో భక్తులకు ఆలయ కమిటీ నాయకులు సేవలందించారు. ఈ సందర్భంగా తిరునాళ్లు నిర్వహించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న గ్రంథాలయాధికారి నాగరాజు

పెద్దాపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలును వెలికి తీసేందుకు ఈ తరగతులు దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయులు తాడిగడప సుబ్బారావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రాములోరి భూములు

- దేవుని భూమి ఆక్రమణ
- సర్వే నెంబర్ 121, 122లో గల 19.92 ఎకరాలు
- అక్రమార్కులకు అధికారుల అండ!
- స్వామివారి భూమిని కాపాడేందుకు ప్రాణత్యాగాలకు సిద్ధమవుతున్న భక్తులు



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)



ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని ప్రసిద్ధి గాంచిన గోర్స సీతారాముల ఆలయానికి కోట్లు విలువ జేసే భూములున్నా అన్యాక్రాంతం కావడంతో ధూప, దీప, నైవేద్యాలు చేయడానికి భారమవుతుంది. ఆలయ అర్చకుడికి ప్రభుత్వం అందించే భృతి, భక్తుల సహకారంతో ధూపదీప నైవేద్యాలు కొనసాగిస్తున్నారు. దేవాలయ బాగోగులు కోసం రాజులు కేటాయించిన భూని నేడు పరుల చేతుల్లో ఉండటంతో దాతల సహకారంతోనే ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది.

ఆలయ నేపథ్యం ఇదీ

ఆ ఆలయాన్ని పిఠాపురం మహారాజు హయాంలో నిర్మించారు. ఆలయానికి సంబంధించి ధూప దీప నైవేద్యాల కోసం గోర్సలో 14 శతాబ్దంలో సర్వే నెంబర్ 121, 122లో 19.92, కుతుకుడుమిల్లిలో సేర్వే నెంబర్ 142/1లో 4.89 ఎకరాలు, 142/2లో 6.25ఎకరాలను కేటాయించడం జరిగింది. అ భూములను కొంతమంది వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారు. రాముడి భూమిలో రావణాసురుల్లా వ్యవహరిస్తున్నారు. ఆలయానికి సంబంధించిన భూమి ఆక్రమణ కోసం గ్రామస్తులు హిందూ ధర్మరక్షా సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. భూమికోసం ప్రతి రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇటీవల గ్రామంలో భక్తులు, గ్రామస్తులు ర్యాలీగా గ్రామ సచివాలయానికి చేరుకుని ఆలయ భూములను రక్షించాలి, దేవుని భూమిని కాపాడాలంటూ ఆందోళన నిర్వహించారు. సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులను నిర్బంధించి తహసీల్దార్, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు రావాలంటూ డిమాండు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు కలెక్టర్‌ను కలిసేందుకు కాకినాడ వెళ్లారు. ఆందోళన జరిగి సుమారు రెండు నెలల గడుస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

పోరాటం ఆగదు



ఆక్రమణలో ఉన్న దేవును భూమిని సాధించుకునే వరకూ పోరాటం ఆగదు. ఆక్రమణదారులకు దేవాదాయ అధికారులు కొమ్ముకాస్తున్నారు. గ్రామస్తులంతా భూమికోసం పోరాడుతుంటే అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించాలి.
– కొటాని సూరిబాబు, గోర్స

మామూళ్ల మత్తులో



రాముడు భూమిని కాపాడుకునేందుకు భక్తులంతా ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారు. సుమారు 40 సంవత్సాలనుంచి గ్రామస్తులంతా కలిసి పోరాటం చేస్తున్న అధికారులు మాత్రం స్పందించడంలేదు. అధికారులు మామూలు మత్తులో ముగుతున్నారు.
– దెందుకూరి గుర్రాజు, గోర్స

ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం



అన్యాక్రాంతం అయిన దేవాలయ భూములను దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోకపోతే గ్రామస్తులు అంతా కలిసి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నాం. వారం రోజుల్లో పరిష్కారం చూపిస్తామని చెప్పిన అధికారులు మాట నిలబెటుకోవాలి.
– రొంగల వీరబాబు, గ్రామ సర్పంచ్, గోర్స

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి



అమ్మవారిని దర్శించుకుంటున్న వంగా గీత

కొత్తపల్లి: ఆలయాల అభివృద్ధికి అంతా సహకరించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వంగా గీత పిలుపునిచ్చారు. మండలంలోని కొమరగిరి గ్రామ దేవత అయిన నేరేళ్లమ్మలమ్మతల్లి తీర్థాన్ని మంగళవారం దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ నాయకులు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి, గాంధీ, గొల్లపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గరగ నృత్యాలు

ఈ సందర్భంగా నిర్వహించిన గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దర్శనానికి ఇబ్బందులు కల్గకుండా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. కొమరగిరి పరిసర గ్రామాలు గోర్స, పండూరు, వెంకటరాయపురం, పెదకలవలదొడ్డితో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బాలికలకు అవగాహన తప్పనిసరి



అంగన్వాడీలతో యాత్ర నిర్వహిస్తున్న సిబ్బంది



అంగన్వాడీ కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న బాలికలు

పిఠాపురం: బాలికలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిషోరీ వికాసం వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలికలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత, వివిధ సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై కిషోరి బాలికలకు అవగాహన కల్పించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా యోగ ఆసనాలు వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుందని అందరు ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు పూర్తవకుండ అమ్మాయికి 21 సంవత్సరాలు పూర్తవకుండా అబ్బాయికి వివాహం చేసినట్లయితే బాల్య వివాహంగా పరిగణించి వారిపై బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 1098 కి లేదా 112 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అలాగే సైబర్ నేరాలపై 1930కి సమాచారం తెలియజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు సూపర్వైజర్ కే.మానసా దేవి యోగతో కలిగే ప్రయోజనాలను వివరించి, కిషోరీ బాలికలతో పలు యోగ ఆసనాలు వేయించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా రోజున కూడా ప్రతి ఒక్కరు పాల్గొనాలని తెలిపారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపీడీఓ కార్యాలయంలో యోగా శిక్షణలో పాల్గొన్న సిబ్బంది


సామర్లకోట: యోగా శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ఈఓ పీఆర్డీ భైరవమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలోని సిబ్బందికి నిర్వహించిన యోగా శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు ప్రతీ రోజు ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పొందిన సిబ్బంది మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. పీడీ యార్లగడ్డ బంగార్రాజు, కె.శ్రీనివాస రావు యోగాపై శిక్షణ ఇచ్చారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఆరోగ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలతో మోసపోవద్దు
- పాఠశాలల పూర్తి సమాచారం తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి



బాలాజీచెరువు: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పుట్టగొడుగుల్లా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థలు వివిధ ప్రాంతాల్లో నూతన శాఖలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. భారీస్థాయిలో ప్రచారాలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా సంస్థలపై విద్యాశాఖ నియంత్రణ కొరవడడంతో అనుమతులున్న పాఠశాలలను గుర్తించడంలో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి పొందాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి.

అవగాహన ఉంటేనే..

గత విద్యా సంవత్సరం నగరంలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు అన్ని అనుమతులు ఉన్నాయని ప్రచారం చేసుకోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ఆ విద్యా సంస్థలో చేర్చారు. ఫీజులు చెల్లించి, పుస్తకాలు సైతం తీసుకున్న తరువాత మరో పాఠశాలలో విలీనం చేశారని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు.

వీటిపై ఆరా తీయండి

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొందాలి. చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్డ్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు, కానీ విద్యాశాఖ నుంచి గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇతర విద్యా సంస్థల తరపున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తుంటారు. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత సర్టిఫికెట్‌ను పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి.
- మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి.
- క్రీడా ప్రాంగణం, ఫిజికల్ ట్రైనర్ ఉన్నారా లేదా తెలుసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి.
- ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రం ఉందో లేదో తెలుసుకోవాలి.
- సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ-1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తిస్థాయి ఏర్పాట్లు ఉండాలి.

ఇలా అయితే ఇబ్బందే

ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

రాజశేఖర్ సేవలు మరువరానివి



రాజశేఖర్‌కు నివాళులు అర్పిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్లు

సామర్లకోట: మున్సిపల్ ఏఈ ఎం.రాజశేఖర్ సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది మంగళవారం రాజశేఖర్ మూడో వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమిషనర్, చైర్‌పర్సన్లు మాట్లాడుతూ మున్సిపల్ పార్కులో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన నాగేంద్రప్రసాద్ విగ్రహం సమీపంలోనే రాజశేఖర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అరుణ పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది సూచనల మేరకు రాజశేఖర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, రాజశేఖరరెడ్డి కుమార్తెలు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి స్ఫూర్తిని కొనసాగిద్దాం



కందుకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాజు తదితరులు

పెద్దాపురం: కందుకూరి వీరేశలింగం స్ఫూర్తిని కొనసాగించేందుకు యువత ముందుండాలని సాహితీ స్రవంతి నాయకుడు, తెలుగు అధ్యాపకుడు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో మంగళవారం వీరేశలింగం 106 వర్ధంతిని నిర్వహించారు. పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బాల, బాలికల విద్యకు ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి కందుకూరి అన్నారు. వితంతు వివాహాలను ప్రోత్సాహించి మొదటి వితంతు వివాహాన్ని ఆయనే జరిపించారన్నారు. శ్రీనవాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఉంటూ అనేక మందిని చైతన్యవంతులను చేసిన కందుకూరి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. తొలుత కందుకూరి చిత్రపటానికి దారపురెడ్డి కృష్ణ, వీర్రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, పీఎస్ఎం నాయకులు కేదారి నాగు, అమృత, నమ్రత, గౌస్, శ్రావిక, అఖిల తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో రికార్డుల తనిఖీ



జయలక్ష్మి థియేటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి తదితరులు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ షణ్మోహన్ సూచనల మేరకు పట్టణ పరిధిలోని సినిమా థియేటర్లను తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక జయలక్ష్మి థియేటర్ స్క్రీన్ 1, 2లకు సంబంధించిన సర్టిఫికెట్లు, రికార్డులను తహసీల్దార్, జిల్లా అగ్నిమాపక సహాయాధికారి శ్రీహరిజగన్నాథ్ పరిశీలించారు. ఈ థియేటర్లకు ఫిలిమ్ డివిజన్ సర్టిఫికెట్, మున్సిపల్ అధికారులు ఇచ్చిన శానిటేషన్ సర్టిఫికెట్లు, శబ్ద నియంత్రణ సర్టిఫికెట్లను యాజమాన్యం చూపించలేక పోయింది. అగ్నిమాపక సర్టిఫికెట్ గడువు 2024 సంవత్సరంతో ముగిసినట్లు గుర్తించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను గుర్తించి 77 చిప్స్ ప్యాకెట్లను తహసీల్దార్ సీజ్ చేశారు. అనంతరం పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వర థియేటర్‌ను అధికారులు తనిఖీ చేశారు. థియేటర్‌కు సంబంధించి అన్ని సర్టిఫికెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల్లో అగ్నిమాపక సిబ్బంది పీఆర్ఆర్ ప్రసాద్, ఎస్సై మూర్తి, వీఆర్వోలు లోవరాజు, ఎండీ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

థియేటర్లలో తనిఖీలు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన కల్యాణ్ ఆదేశాలతో అధికారులు సినిమా థియేటర్లలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. పిఠాపురంలోని పలు సినిమా థియేటర్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. థియేటర్‌లో తినుబండారాలు విక్రయించే చోట ఏర్పాటు చేసిన ధరల పట్టిక (డిస్‌ప్లే బోర్డు)లో పేర్కొన్న ధరలకు, దుకాణదారుడు వసూలు చేసే ధరలకు వ్యత్యాసం ఉందని చెప్పారు. మౌలిక సదుపాయాలు, మూత్ర శాలలను తనిఖీ చేశారు. రెవెన్యూ పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారుల బృందాలు పాల్గొన్నాయి.

గృహనిర్మాణాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ అధికారి సత్యనారాయణ

కొత్తపల్లి: మంజూరై నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఎస్‌వివి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి లబ్ధిదారుడి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చమురు సంస్థల తీరుపై రైతుల నిరసన

కరప: యండమూరులోని ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థల కార్యకలాపాలతో, వాహనాల రాకపోకలతో పొలాలకు వెళ్లే రహదారిని ధ్వంసం చేయడమే కాకుండా, గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని సదరు సంస్థల పనితీరును నిరసిస్తూ సర్పంచ్ మార్రెళ్ల శివ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు ధర్నా చేశారు. యండమూరులో సదరు సంస్థల రిగ్ పాయింట్ వద్ద టెంట్‌వేసి మంగళవారం గ్రామస్తులు, రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఆయా సంస్థలకు సంబంధించిన భారీ వాహనాల రాకపోకలతో రహదారి ధ్వంసమైందని, లింగోల వంతెనను ఢీకొట్టి ధ్వంసం చేశారన్నారు. దీంతో 1100 ఎకరాలకు చెందిన రైతులు, అక్కడి పనులకు వెళ్లే కూలీలు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు.